

తిరుపతి అన్నారావు సర్కిల్..



గంగమ్మ గుడి దారిలో విరిగిపడిన చెట్టు



పెద్దకాపు లేఅవుట్‌లో పడిపోయిన చెట్టు, ధ్వంసమైన కారు

దెబ్బతిన్న వాహనం, ఆటో, బైకులు

గాలివాన బీభత్సం

- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- పిడుగుపాటుకు ముగ్గురి మృతి
- కాస్త చల్లబడిన జిల్లా

తిరుపతి, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు చోట్ల ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. తిరుపతిలో దాదాపు రెండు గంటల పాటు వణికించింది. ఈదురు గాలులకు పలు చెట్లు నేలకొరిగాయి. హోర్డింగులు, ఫ్లెక్సీలు కూలాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలులతో పాటు ఓ మోస్తరు వర్షం కురవడంతో రోడ్లపై వర్షపు నీరు పొంగి పొర్లాయి. దాదాపు రెండు గంటలపాటు వాహనదారులు రోడ్లపైకి వచ్చేందుకు భయపడ్డారు. నాయుడుపేట, గూడూరులో ఉరుములతో కూడిన వర్షం పడింది. ఈక్రమంలో పడిన పిడుగులకు నాయుడుపేట, ఓజిలి, చిల్లకూరు మండలాల్లో ముగ్గురు మృతిచెందారు. రేణిగుంట రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండు సమీపంలో వర్షపు నీరుతో పాటు మురుగునీరు రోడ్డుపైకి రావడంతో యాత్రికులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పలు గ్రామాల్లో ఈదురు గాలులకు మామిడి కాయలు నేలరాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.





మధురానగర్‌లో చేరిన వర్షపు నీరు

సదరన్ డిస్కంకు రూ.20 లక్షల నష్టం

తిరుపతి(ఆటోనగర్), మే 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో గాలి వాన బీభత్సానికి సుమారు రూ.20 లక్షల నష్టం జరిగిందని సదరన్ డిస్కం టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖర్ రావు తెలిపారు. పెనుగాలులకు చెట్లు, కొమ్మలు, ఫ్లెక్సీలు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో 18 ట్రాన్స్‌ఫార్మర్లు, 70 విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. పది కిలోమీటర్లు వైర్లు తెగిపడ్డాయన్నారు. దశలవారీగా విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని పునరుద్ధరించినట్లు తెలిపారు. నగర పరిధిలో ఎక్కువగా ఫ్లెక్సీల వల్ల ఎక్కువ నష్టం జరిగినట్లు ఆయన చెప్పారు.

బడుగులపై 'పిడుగు'

- వద్దిగుంట కండ్రిగలో వ్యవసాయ కూలీ మృతి

నాయుడుపేట టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం వద్దిగుంట కండ్రిగ గ్రామంలో వరినాట్లు వేయడానికి వ్యవసాయ కూలీ ఆనాల భాస్కర్(50) వెళ్లారు. ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో భారీ వర్షం రావడంతో సమీపంలోని చెట్టుకిందకు చేరారు. అదే సమయంలో పిడుగుపడడంతో అక్కడికక్కడే కుప్పకూలారు. స్థానికులు ఆయన్ను నాయుడుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.



బాతుల కాపరి మృతి

చిల్లకూరు, ఆంధ్రజ్యోతి: చిల్లకూరు మండలం కాకువారిపాళెం సమీపంలోని పొలాల్లో ఆదివారం పిడుగుపడి బాతుల కాపరి మునీంద్ర (30) మృతిచెందారు. వాకాడు మండలం బాలిరెడ్డిపాళేనికి చెందిన ఈయన కాకువారిపాళెం సమీపంలోని పొలాల్లో బాతులు మేపుతుండగా ఈ ప్రమాదం జరిగింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తాటికాయలు తీసుకొస్తుండగా..



ఓజిలి, ఆంధ్రజ్యోతి: ఓజిలి మండలం గ్రద్దగుంట పంచాయతీ గొల్లపాళేనికి చెందిన మారుబోయిన కార్తీక్ (12) తాటికాయులు తీసుస్తుండగా పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. నాయుడుపేటలో ఏడో తరగతి చదువుతున్న ఇతడు, వేసవి సెలవుల్లో ఇంటికొచ్చాడు. మరో బాలుడితో కలిసి ఆదివారం సమీప పొలాల్లో తాటికాయల కోసం వెళ్లాడు. కార్తీక్ బాబాయి వారికి తాటికాయలు కొట్టించి.. వర్షం వస్తుండటంతో ఇంటికి పంపేశారు. ఇంటికి సమీపానికి వచ్చేసరికి జల్లులతో పాటు పిడుగు పడటంతో కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే ఉన్న మరో బాలుడు స్పృహ తప్పి పడిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు నాయుడుపేటకు తరలించారు.

వర్షం కారణంగా తిరుపతి నగరంలో పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగిపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. కార్పొరేషన్, ఎస్పీడీసీఎల్ అధికారులు రంగప్రవేశం చేసి సాయంత్రానికి సమస్యలను పరిష్కరించారు.

జాతర వాన అంటూ..

ప్రతిసారి తిరుపతి గంగజాతర చాటుకు ముందు చిన్నపాటి గాలులతో కూడిన వర్షం పడుతుందని స్థానికులు చెబుతుంటారు. ఈ క్రమంలో గంగజాతరకు మంగళవారం జరగనున్న చాటింపునకు ముందు వర్షం పడడంపై జాతరవానగా భక్తులు విశ్వసిస్తున్నారు. జాతర మొదలవ్వబోతుందన్న సంకేతాన్ని గాలివాన ద్వారా వచ్చిందని, వర్షంతో నగరం చల్లబడిందని సోషల్ మీడియాలో అమ్మవారి భక్తులు పోస్టులు పెడుతున్నారు.

తిరుపతిలో విరిగిన వందేళ్ల వృక్షం

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ సమీపంలో వందేళ్ల నాటి వృక్షం ఈదురుగాలులకు సగ భాగం విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న ఓ ఆటో డ్రైవర్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి. కర్నాల వీధిలో మరో చెట్టు నేలకొరిగింది. సాయినగర్‌లో చెట్టుకొమ్మ విరిగి పడడంతో ఆటో ధ్వంసమైంది. వేర్వేరు చోట్ల చెట్లు పడి ఓ కారు, జీపు, రెండు బైకులు దెబ్బతిన్నాయి.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

గాలులకు పలు కరెంటు స్తంభాలు నేలకొరిగాయి. పలుచోట్ల చెట్లు, ఫ్లెక్సీలు విరిగి కరెంటు తీగలపై పడ్డాయి. ఈ ఘటనలతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి త్వరితగతిన సరఫరాను పునరుద్ధరించారు. ఇక, తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీలో ఈదురుగాలుల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్‌పై చెట్టు కూలింది. ఇక్కడ మరమ్మతులు చేయడానికి వెళ్లిన సచివాలయ జేఎల్ఎం మురళి గాయపడగా, ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కేవీబీపురంలో విద్యుత్ సబ్ స్టేషన్‌పై చెట్టు కూలడంతో సరఫరా ఆగింది. ఇలా..



పిచ్చాటూరు మండలం కొత్తగొల్లకండ్రిగ వద్ద..

ప్రశాంతంగా నీట్

- 4,333 మంది విద్యార్థులు హాజరు.. 112 మంది గైర్హాజరు
- విద్యార్థులకు తప్పని కరెంటు కష్టాలు



తిరుపతి పద్మావతి డిగ్రీ కళాశాల కేంద్రం వద్ద..



తమ పిల్లలు పరీక్ష రాస్తుండగా.. వర్షంలో తడుస్తున్న తల్లిదండ్రులు

తిరుతి(విద్య), మే 4(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్ యూజీ-2025) ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరగ్గా.. ఉదయం 11 గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. జిల్లా వ్యాప్తంగా 4,445 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 4,333 మంది పరీక్ష రాయగా, 112 మంది గైర్హాజరయ్యారు. తిరుపతిలోని పలు పరీక్ష కేంద్రాలను డీఆర్వో నరసింహులు తనిఖీ చేశారు. తిరుపతిలో 9, గూడూరులో ఒకటి చొప్పున 10 కేంద్రాల్లో ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరిగింది. అన్ని పరీక్షా కేంద్రాలవద్ద 144 సెక్షన్ అమలు చేశారు. పరిసర ప్రాంతాల్లో జిరాక్స్. ఇంటర్నెట్ సెంటర్లను మూయించారు. కేంద్రీయ విద్యాలయం-1 ప్రిన్సిపల్ హేమంత్‌కుమార్ పాండ్య నీట్ సిటీ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు.



ముక్కుపుడక తీసిస్తూ.. - విద్యార్థి చేతి దారాన్ని తీసేస్తున్న సిబ్బంది

విద్యార్థులతో కలిసొచ్చిన తల్లిదండ్రులు

విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులూ పెద్ద సంఖ్యలో పరీక్ష కేంద్రాల వద్దకు వచ్చారు. పరీక్ష బాగా రాయాలని ధైర్యం చెప్పారు. కొందరు పిల్లలు తల్లిదండ్రులతో సెల్ఫీలు తీసుకుంటూ నీట్‌కు హాజరవుతున్న సందర్భాన్ని పదిలం చేసుకున్నారు.




విద్యార్థులకు బయోమెట్రిక్ వేస్తున్న సిబ్బంది

చీకట్లో పరీక్షలు : ఆదివారం మధ్యాహ్నం తిరుపతిలో సుమారు రెండు గంటలపాటు భారీ వర్షం కురిసింది. ఈదురుగాలు బలంగా వీయడంతో నగరంలో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.దీంతో తిరుపతిలోని పరీక్షా కేంద్రాల్లోనూ విద్యుత్తు సరఫరా ఆగింది.భారీ గాలులు, వర్షంతో కిటికీలు, తలుపులు వేశారు. అదే సమయంలో కరెంటు పోవడంతో గదుల్లో నెలకొన్న చీకటిలోనే విద్యార్థులు పరీక్ష రాయాల్సి రావడంతో అసౌకర్యానికి గురయ్యారు.

గ్రూప్-1 పరీక్షలకు 619మంది హాజరు

తిరుపతి(కలెక్టరేట్), మే 4(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్ రాతపరీక్షకు ఆదివారం 911 మంది అభ్యర్థులకు గాను 619 మంది హాజరయ్యారని డీఆర్వో నరసింహులు తెలిపారు.కేంద్రాలను తనిఖీ చేసిన ఆయన పరీక్షల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు.డీఆర్వో మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరుగుతున్నాయన్నారు. అభ్యర్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించామని తెలిపారు.

తిరుమల ఘాట్‌రోడ్లకు మహర్దశ



రూ.10.75 కోట్లతో పనులకు టీటీడీ ప్రణాళిక

తిరుమల, మే4(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్ రోడ్ల మరమ్మతులపై టీటీడీ దృష్టి సారించింది. రూ.10.75 కోట్లతో అభివృద్ధి చేయాలని సంకల్పించింది. తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డు 17 కిలోమీటర్లు, తిరుమల నుంచి తిరుపతి చేరుకునే మొదటిఘాట్‌రోడ్డు 18 కిలోమీటర్ల పొడవుతో ఉంటాయి. భక్త రద్దీ నేపథ్యంలో రోజూ 10 వేల వాహనాలు ఈ మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నాయి. లారీలు, టిప్పర్లు కూడా తిరుగుతుంటాయి. దీంతో తరచూ ఘాట్ రోడ్లు దెబ్బతింటున్నాయి. చివరిగా 2021 జనవరిలో కొత్త రోడ్డు(బీటీ రెన్యూవల్ కోట్) వేశారు. అయితే కొవిడ్ తర్వాత వాహనాల సంఖ్య పెరిగింది. 2021 నవంబరు, డిసెంబరు నెలల్లో భారీ వర్షాలు, డ్రైనేజీ, క్రాష్‌బ్యారియర్ వంటి పనులతో ఘాట్‌రోడ్లు భారీగా దెబ్బతిన్నాయి. అనేక ప్రాంతాల్లో గుంతలు ఏర్పాడ్డాయి.

వర్షాకాలం రాకముందే పూర్తి

భక్తులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని టీటీడీ అధికారులు ఘాట్‌రోడ్లలో మళ్లీ మరమ్మతులు చేపట్టాలని నిర్ణయించారు. బిట్యూమినస్ కాంక్రీట్, బిట్యూమినస్ మెకాడమ్, హాట్ అప్లైడ్ థర్మోప్లాస్టిక్ కంపౌండ్ వంటి పనులతో పాటు రైజ్డ్ పేవ్‌మెంట్ మార్కర్లు(రోడ్ స్టడ్స్), సైన్‌బోర్డులు వంటిని ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందించింది. వర్క్స్ కమిటీ కూడా మరింత అధ్యయనం చేపట్టి చర్యలు తీసుకోవాలని సూచించింది. వర్షాకాలం రాకముందే ఈపనులు ప్రారంభించేలా టెండర్లను ఆహ్వానించేందుకు టీటీడీ సిద్ధమవుతోంది.

7న సత్యవేడుకు మంత్రి లోకేశ్?

సత్యవేడు, మే 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ ఈనెల 7న సత్యవేడుకు రానున్నట్లు సమాచారం. సత్యవేడులో జరగనున్న టీడీపీ సమన్వయ సమావేశానికి హాజరవుతారని తెలిసింది. ఇటీవల పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదులో ముందు వరుసలో నిలిచిన పార్టీ నేతలు, కార్యకర్తలతో లోకేశ్ భేటీ కానున్నారని సమాచారం. ఈ మేరకు లోకేశ్ పర్యటన విజయవంతం చేసేందుకు కూటమి నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యకర్తలతో లోకేశ్ సమావేశమయ్యేందుకు స్థానిక వారపు సంత వద్ద స్టేజీ ఏర్పాటు చేస్తున్నారు. లోకేశ్ పర్యటన నేపథ్యంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆదివారం సత్యవేడుకు చేరుకుని స్థానిక నేతలతో చర్చించారు. లోకేశ్ కార్యకర్తల సమావేశం అనంతరం రాత్రి సత్యవేడులోనే బస చేసి, 8వ తేదీ ఉదయం శ్రీసిటీలో జరగనున్న ఎల్‌జీ పరిశ్రమ భూమిపూజలో పాల్గొంటారని సమాచారం. లోకేశ్ పర్యటనపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

భారీ వర్షానికి కూలిన చెట్లు,విద్యుత్ స్తంభాలు



సాయినగర్‌లో చెట్టు మీద పడటంతో దెబ్బతిన్న ఆటో- కూలినచెట్టు

తిరుచానూరు, మే 4(ఆంధ్రజ్యోతి): భగభగలాడే ఎండలకు అల్లాడుతున్న వేళ కురిసిన వర్షానికి జనం ఉపశమయం పొందినా కొంతమేర నష్టం వాటిల్లింది. రూరల్ మండలంలో ఆదివారం మధ్యాహ్నం గంటకు పైగా కురిసిన వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తిరుచానూరు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీల భాగాలు తగులుకున్నాయి. రఘునాథ్‌రిసార్ట్స్‌లో విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. సాయినగర్‌లో కొన్ని చెట్లు నేలకూలాయి. చెట్టు మీద పడటంతో ఓ ఆటో పాక్షికంగా దెబ్బదింది. సాయినగర్ సర్పంచ్ డీవీ రమణ, స్థానికులు, ప్రభుత్వ ఉద్యోగులు కలిసి కూలిన చెట్లును తొలగించడానికి పూనుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో రాత్రి 7.30 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. అమ్మవారి ఆలయం నిర్మాన్యుషంగామారింది.

విద్యుత్‌షాక్ : జేఎల్‌ఎంకి తీవ్రగాయాలు



మురళిని ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

తిరుపతిరూరల్, మే4(ఆంధ్ర జ్యోతి): చిగురువాడ పంచాయతీ పరిధిలోని సచివాలయ జేఎల్‌ఎం మురళి విద్యుత్‌షాక్‌తో ఆదివారం తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా.. సంస్కృతనగర్‌లో మధ్యాహ్నం ఈదురుగాలుల కారణంగా ట్రాన్స్‌పార్మర్‌పై చెట్టుపడింది. మురళి వెళ్లి మరమ్మతులు చేపడుతుండగా విద్యుదాఘానికి గురయ్యారు. తీవ్ర గాయపడి అర్ధగంట వరకు ట్రాన్స్‌పార్మర్‌పైనే చిక్కుకున్నారు. రూరల్ పోలీసులు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవి, సర్పంచ్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, విద్యుత్ అధికారులు చేరుకుని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

అమరనాథరెడ్డిని కలిసిన డీసీఎంఎస్ చైర్మన్



అమరనాథరెడ్డిని సత్కరిస్తున్న సుబ్రమణ్యంనాయుడు,చిత్రంలో ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, మే 4(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని ఆదివారం డీసీఎంఎస్ చైర్మన్ పల్లినేని సుబ్బ్యణ్యంనాయుడు, ఎమ్మెల్యే పులివర్తి నానితో పాటు మర్యాదపూర్వకంగా కలిశారు. తన పదవికి సహకరించినందుకు ఆయకు పుష్ప గుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నాయకులు శుభగిరి, గౌస్‌బాషా, బాలకృష్ణమూర్తి, కొండూరు ప్రవీణ్‌రాయల్, మేడసాని కుమార్, నగరం రమేష్, చెంచయ్యనాయుడు, రాజులుగారి వినోద్, లోకాద్రి, గాలి సతీష్, ధనంజయ, లోకేష్, తదితరులు పాల్గొన్నారు. సుబ్రమణ్యంనాయుడిని మండల టీడీపీ ఉపాధ్యక్షుడు అత్తూరు తులసేశ్వరరెడ్డి సన్మానించారు. టీడీపీ నాయకులు రమేష్, మేడసాని కుమార్ పాల్గొన్నారు.

అలరించిన కళాకారుల నృత్యం



తిరుచానూరు, మే 4(ఆంధ్రజ్యోతి): తిరుచానూరురోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సెలవులను పురస్కరించుకుని ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు అమోఘంగా సాగాయి. చెన్నైకి చెందిన శివార్పణం స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ కళాకారులు సాయికీర్తన రాజన్, పూజ, రజిత, నిహారిక, దివ్యదర్శిని, ధృతి, అభిరామి తదితరులు పుష్పాంజలి, శ్రీవిఘ్నరాజం, మూషికవాహన వంటి కీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేశారు. నృత్య ప్రదర్శన తర్వాత ఈకళాకారులకు శిల్పారామం ఏవో సుధాకర్‌జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

ఘనంగా మదర్సా వార్షికోత్సవం



చంద్రగిరి, మే 4(ఆంధ్ర జ్యోతి): తొండవాడలోని మదర్సాలో వార్షికోత్సవానికి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ ముబారక్ జాన్, ఏవో అబ్దుల్ అజీజ్‌లు మాట్లాడుతూ మదర్సా అధినేత షేక్ నౌహిరా పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు ఈ విద్యాసంస్థను స్థాపించారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఆశయాన్ని కొనసాగించడంగొప్ప విషయమన్నారు.

బదిలీపై వెళ్ళిన కానిస్టేబుళ్లకు సన్మానం



చంద్రగిరి, మే 4(ఆంధ్రజ్యోతి): స్థానికి పోలీస్ స్టేషన్ నుంచి 10 మందికి జిల్లాలో వివిధ స్టేషన్‌లకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆదివారం వారికి వీడ్కోలు పలికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీఐ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ బదిలీపై వెళ్ళుతున్న సిబ్బంది విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. సన్మానం పొందిన వారిలో ఏఎస్‌ఐ సుధాకర్, హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తంనాయుడు, జయచంద్రనాయుడు, కానిస్టేబుల్స్ దేవరాజులు, సుబ్రమణ్యం, దివాకర్, దేవేంద్ర, వెంకటరెడ్డిలు ఉన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ అనిత, ఏఎస్ఐలు జయరామయ్య, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో శివుడి విగ్రహ ప్రతిష్ఠ



తిరుపతిరూరల్, మే4(ఆంధ్రజ్యోతి): తనపల్లెగ్రామ శ్మశానవాటికలో ఆదివారం శివుడి విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలు చేశారు. గ్రామానికి చెందిన గురవారెడ్డి, మునెమ్మ జ్ఞాపకార్థం కుమారులు బి.విజయసింహారెడ్డి, బి.బాలచంద్రారెడ్డి కుటుంబసభ్యులు రూ.2లక్షలతో ఈవిగ్రహాన్ని ప్రతిష్టించారు.

ఆదిశేషుడిపై సదాశివుడి దివ్య స్వరూపం



పుత్తూరు టౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షిదేవి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామిఅమ్మవార్లు ఆదిశేషుడిపై విహరిస్తూ భక్తుల ను కటాక్షించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం 7.30 గంటలకు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పుష్పాలతో అలంకరించి ఆదిశేష వాహనంపై అధిష్ఠింపజేసి పట్టణంలో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, మే4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 14 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.4.12 కోట్లు లభించింది. శనివారం శ్రీవారిని 84,113 మంది భక్తులు దర్శించుకున్నారు. 33,868 మంది తలనీలాలు సమర్పించారు.

ట్యాక్సీ నుంచి జారిపడి మహిళకు గాయాలు



తిరుమల, మే4(ఆంధ్రజ్యోతి): కదులుతున్న వాహనం నుంచి మహిళ జారి కింద గాయపడింది. తిరుపతికి చెందిన ఓ మహిళ తిరుమలలో ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేస్తోంది. ఎప్పటిలానే విధులకు హాజరయ్యేందుకు ట్యాక్సీలో ఆదివారం ఉదయం తిరుమలకు చేరుకుంది. జీఎన్సీ టోల్‌గేట్ దాటాక కారు డోర్‌కు లాక్ పడకపోవడంతో మహిళ ప్రమాదవశాత్తూ జారి కింద పడింది. దీంతో ఆమె గాయపడింది.

హెల్మెట్ ధరించని వారికి రూ.67 వేల జరిమానా

తిరుమల, మే4(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించని ద్విచక్ర వాహనదాలకు తిరుమల ట్రాఫిక్ పోలీసులు రూ.67,275 జరిమానా విధించారు. ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ తన బృందంతో కలిసి ఆదివారం సాయంత్రం జీఎన్సీ టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ ధరించకుండా తిరుమలకు వచ్చిన 65 మంది ద్విచక్ర వాహనదారులకు రూ.67,275 జరిమానా విధించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తిరుమలకు వచ్చే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనన్నారు. సురక్షితమైన ప్రయాణం కోసం హెల్మెట్‌ను వినియోగించాలన్నారు.

చికిత్స పొందుతున్నడ్రైవర్ మృతి



రామ్మూర్తి నాయుడు (ఫైల్‌ఫొటో)

రామచంద్రపురం,తిరుత్తణి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) బస్సు చెట్టును ఢీకొన్న ఘటనలో చికిత్స పొందుతున్న డ్రైవర్ మృతిచెందాడు. గురువారం మధ్యాహ్నం పల్లిపట్టు-షోలింగర్ జాతీయ రహదారిలో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన తిరుపతికి చెందిన బస్సు డ్రైవర్ రామ్మూర్తి నాయుడు (53)సహా పది మందిని పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో, ఆస్పత్రిలో రెండ్రోజులుగా చికిత్సపొందుతున్న బస్సు డ్రైవర్ రామ్మూర్తి శనివారం సాయంత్రం చికిత్స ఫలించకపోవడంతో మృతిచెందాడు. ఇతనికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రామ్మూర్తినాయుడు మృతితో ఎన్ఆర్‌కమ్మపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.

9న షర్మిల జిల్లాకు రాక

చిత్తూరు రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ బలోపేతం చేయడంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రాజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 9వ తేదీన మధ్యాహ్నం 3.30 గంటలకు చిత్తూరులో పర్యటించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం



చంద్రయ్య (ఫైల్‌ఫొటో)

దొరవారిసత్రం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మావిళ్లపాడు గ్రామానికి చెందిన బట్టా చంద్రయ్య(60) రైలు ఢీకొని మృతి చెందాడు. ఆదివారం పొలాల్లోకి వెళ్లిన చంద్రయ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతొ దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సూళ్లూరుపేట రైల్వే పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలిం చారు. మృతదేహానికి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

గాయపడిన బాలుడి మృతి

తడ, మే 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. తమిళనాడు ఆరంబాకం బాట కుప్పం ప్రాంతానికి చెందిన దేశప్పన్(14) తడ మండలం వాటంబేడు కుప్పంలో ధర్మరాజస్వామి ఉత్సవాల్లో పాల్గొనేందుకు గత నెల 29న బంధువుల ఇంటికి వెళ్లాడు. స్నేహితుడు శివలింగంతో కలిసి మోటరు సైకిల్‌పై సూళ్లూరుపేటకు వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడ డంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యంకోసం ఇరువురినీ చెన్నైకి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ దేశప్పన్ శనివారం మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు తడ పోలీసులు కేసు నమోదు చేశారు.

మన 'చేతుల్లోనే' ఆరోగ్యం



● నేడు ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం

తిరుపతి(వైద్యం), మే 4(ఆంధ్రజ్యోతి): కొవిడ్ తరువాత చేతుల పరిశుభ్రతపై అవగాహన పెరిగింది. ఏ చిన్న పనిచేసినా చేతులు కడుక్కోవడం అలవాటుగా మారింది. పలు రకాల వ్యాధులకు కారణమైన క్రిములు ఒకరి నుంచి ఒకరికి చేతుల ద్వారానే వ్యాపిస్తాయని గుర్తిస్తున్నారు. ఈక్రమంలోనే శానిటైజర్లు, హ్యాండ్‌వాష్‌లను వాడటం అలవరుచుకున్నారు. చేతులు పరిశుభ్రంగా ఉంచుకుంటే కొన్ని రకాల వ్యాధులు దరిచేరవని వైద్యులూ పదేపదే చెబుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నాయి.

చేతుల శుభ్రత అలవాటు కావాలి



పురిటి బిడ్డలు మొదలు నెలలు నిండని చిన్నారుల వరకు ముట్టుకునే ముందు చేతులను శుభ్రం చేసుకోవాలి. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం వలన మన చేతుల్లోని క్రిములు పసికందులకు సోకి వ్యాధుల బారిన పడతారు. చిన్నతనం నుంచే చేతులను శుభ్రంగా ఉంచుకోవడం అలవాటు చేయాలి. తల్లిదండ్రులు కూడా నిత్యం చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. కొవిడ్ వంటి భయంకరమైన వైరస్ కూడా ఇలా చేయకపోవడం వల్లే వ్యాపించిందని గుర్తుంచుకోవాలి.

-డాక్టర్ మనోహర్, చిన్నపిల్లల విభాగాధిపతి, రుయాస్పత్రి

కొన్ని క్రిములు చేతుల్లోనే ఉంటాయి



తుమ్మినా, దగ్గినా చేతులను అడ్డం పెట్టుకుంటాము. దీనివల్ల ముక్కు, లేదా నోటి నుంచి వచ్చే క్రిములు బయటకు వెళ్లకుండా ఆపగలం. అలా పెట్టుకున్న వెంటనే చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. లేకపోతే ఆ చేతులతో మరొకరిని ముట్టుకున్న, ఇంకేమైనా వస్తువులను ముట్టుకున్నా ఆ క్రిములు మరొకరికి చేరే ప్రమాదముంది. ఇలాంటి చర్యలతోనే టీబీ, ఆయాసం వంటి జబ్బులు ఎక్కువగా వ్యాపిస్తాయి. చేతులు శుభ్రంగా ఉంచుకుంటే అంటువ్యాధులను నివారించవచ్చు.

- డాక్టర్ సుబ్బారావు, పల్మనాలజీ విభాగాధిపతి, రుయాస్పత్రి





నారాయణగిరి ఉద్యానవనంలో పరిణయోత్సవ వేదిక- ముస్తాబవుతున్న స్వాగతద్వారం

పద్మావతి పరిణయోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు

తిరుమలలో ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు జరుగనున్న పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలకు ఏర్పాట్లు మొదలయ్యాయి. నారాయణగిరి ఉద్యానవనంలోని పరిణయోత్సవ మండపంలో వేడుకలను నిర్వహించనున్నారు. తొలిరోజు మలయప్పస్వామి గజవాహనం, రెండవరోజు అశ్వవాహనం, చివరిరోజు గరుడవాహనంపై వేంచేపు చేస్తారు. ఉభయ నాంచారులను ప్రత్యేక పల్లకీలో పరిణయోత్సవ మండపానికి వేంచేపు చేస్తారు. తర్వాత కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహిస్తారు. ఈక్రమంలో వేదిక వద్ద ప్రత్యేక సెట్టింగుల పనుల్లో బెంగళూరు, చెన్నై నగరాల నిపుణులు నిమగ్నమయ్యారు. -తిరుమల, (ఆంధ్రజ్యోతి)

తిరుమల కల్యాణ వేదికకు విశేష స్పందన

● 2016 నుంచి 26,214 వివాహాలు
● శ్రీవారి దర్శనంతో పలు వసతులు



తిరుమల, మే4(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిర్వహిస్తున్న ఉచిత వివాహాలకు విశేష స్పందన లభిస్తోంది. 2016 ఏప్రిల్ 25 నుంచి తిరుమల పాపవినాశనం రోడ్డులోని కల్యాణవేదికలో ఉచితంగా వివాహాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటివరకూ 26,214 వివాహాలు అయ్యాయి. పురోహితుడు, మంగళవాయిద్యంతో పాటు పెళ్లి సమయంలో పసుపు, కుంకుమ, కంకణాలను టీటీడీ ఉచితంగా సమకూర్చుతుంది. వివాహానికి కావాల్సిన ఇతర సామగ్రిని మాత్రం వధువరులే తీసుకురావాల్సి ఉంటుంది. వివాహానికి వధువరుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. రాలేని పక్షంలో అందుకు సంబంధించి ఆధార పత్రాలను సమర్పించాలి. వివాహానంతరం రూ.300 ప్రత్యేక ప్రవేశం ద్వారా పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెతో పాటు ఇరువెరి తల్లిదండ్రులను కలుపుకుని మొత్తం ఆరుగురికి ఏటీసీ వద్దనున్న క్యూలైన్ మార్గం ద్వారా ఉచితంగా శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు. దర్శనం తర్వాత ఉచితంగా ఆరు లడ్డూలు అందజేస్తారు. కల్యాణవేదికలో పెళ్లిళ్ల చేసుకునేందుకు 'టీటీడీదేవస్థానమ్స్.ఏపీ.జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్‌లో సంప్రదించాల్సి ఉంటుంది. వివాహాలు చేసుకునే వారు తప్పనిసరిగా హిందూ మతస్థులై ఉండాలి. అవివాహితులని తెలిపే ధ్రువీకరణ పత్రాం సమర్పించాల్సి ఉంటుంది. పూర్తివివరాలకు 0877 2263433 నెంబరును సంప్రదించవచ్చని టీటీడీ తెలిపింది.

పాత్రధారుల అరెస్టు సరే... సూత్రధారుల సంగతేమిటి ?

టీడీపీ నేత హత్య వెనుక కుట్రకోణం వెలుగులోకి వచ్చేనా!

నాయుడుపేట టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం అత్తివరం గ్రామానికి చెందిన టీడీపీ నేత ఎల్లు గురుమూర్తి హత్య కేసులో నలుగురిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే వీరితో మృతుడు గురిమూర్తికి నేరుగా ఎలాంటి వివాదాలు లేవు. అత్తివరం గ్రామంలో ఇరువర్గాల మధ్య వివాదాలు ఉన్న నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడిచేసుకుని కేసులు నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలో ఏప్రిల్ 27వ తేదీ రాత్రి గురుమార్తి, అత్తివరం గ్రామానికే చెందిన అనిల్‌రెడ్డితో కలిసి మోటరు సైకిల్‌పై నాయుడుపేట నుంచి ఇంటికి వెళుతుండగా ద్వారకాపురం సమీ పంలో మినీవ్యానుతో వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో గురుమూర్తి మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన మినీ వ్యాను, అందులోని ముగ్గు రితో పాటు గురుమూర్తిని బైక్‌లో వెంబడించిన మరో వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. మృతుడి కుమారుడు గురుతేజ తన తండ్రిని పథకం ప్రకారం హత్య చేయించారని, అందులో తమ సామాజిక వర్గానికి చెందిన వారే ప్రధాన పాత్ర పోషించారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అత్తివరం గ్రామానికి చెందిన 13మందిపై కేసు నమోదు చేశారు. అయితే వ్యానుతో వెనుక నుంచి ఢీకొట్టి హత్య చేసిన ఘటనలో పాలుపంచుకున్న నలుగురిని మాత్రమే శనివారం పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన సూత్రధారులను విచారణ పేరుతో స్టేషన్‌కు పిలిపించి పంపించేశారు. తమ సామాజిక వర్గానికి చెందిన వారే తన తండిని హత్య చేయించారని మృతుడి కుమారుడు గురుతేజ ఫిర్యాదులో పేర్కొన్నాడు. మర్నాడే 13మందిపై కేసు కూడా నమోదు చేశారు. హత్యకు ఉపయోగించిన వాహనాన్ని రెండు రోజుల ముందు గురుమూర్తి ప్రత్యర్థులు కొనుగోలు చేసినట్లు అగ్రిమెంట్ పేపర్లను పోలీసులు స్వాధీనం చేసుకోవడం కూడా సూత్రదారుల ప్రమేయం ఉందనడానికి బలం చేకూరుస్తోంది. నలుగురు నిందితులనే అరెస్టు చేయడం వెనుక ఆంతర్యం ఏమిటనేది చర్చనీయాంశం అయింది.

గోడౌన్‌లో నగదు చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



నిందితులను, పట్టుబడిన నగదును చూపుతున్న సీఐ తదితరులు

పుత్తూరు అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో ఇద్దరు నిందితు లను అరెస్టు చేసి నగదు, బైక్ స్వాధీనం చేసు కున్నట్టు సీఐ సురేంద్ర నాయుడు చెప్పారు. నిందితుల అరెస్టు చూపి వివరాలను మీడియాకు తెలిపారు. గత నెల 19న పట్టణంలోని ఈశ్వరీ కల్యాణ మండపం పక్క న ఉన్న మీనాక్షీ ఏజెన్సీ పాన్ మసాలా హోల్ సేల్ గోడౌన్‌లో రూ.6.30 లక్షల నగదు చోరీకి గురైంది. పిచ్చాటూరు మండలం శేషంబేడుకు చెందిన కైలాసం ఠాగూర్, బుడుగు పాండియన్ మరో ఇద్దరు దినేష్, జగన్ సాయంతో చోరీకి పాల్పడ్డారు. జల్సాలకు, బెట్టింగులకు అలవాటు పడిన కైలాసం ఠాగూర్ అప్పులు చేశాడు. రుణదాతలు ఒత్తిడి చేయడంతో పాండియన్, గుమ్మడిపూండికి చెందిన దినేష్, జగన్‌ను కలుపుకుని చోరీకి పథకం రచించారు. గత నెల 19న మీనాక్షి ఏజెన్సీలో రూ.6.30 లక్షలు చోరీ చేశారు. ఇందులో ఠాగూర్ రూ.2.20 లక్షలు, పాండియన్ రూ.2.10 లక్షలు, దినేష్ రూ.లక్ష, జగన్ రూ.లక్ష చొప్పున పంచుకున్నారు. చోరీ చేసిన రోజునే చెన్నైకి వెళ్లిపోయారు. తమపై అనుమానం రాలేదని నిర్ధారించుకుని ఠాగూర్, పాండియన్ రెండు రోజుల క్రితం స్వగ్రా మా లకు వచ్చారు. ఆదివారం చెన్నైలో ఉన్న దినేష్ జన్మదినం కావడంతో పార్టీ చేసుకోవడానికి ఠాగూర్, పాండియన్ బయలుదేరారు. సమా చారం తెలుసుకున్న పోలీసులు నారాయణ వనం జంక్షన్ వద్ద వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా చోరీ చేసినట్టు అంగీకరించారు. వారినుంచి రూ.2 లక్షలను, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్‌ఐ ఓబయ్య పాల్గొన్నారు.

శేషవాహనంపై అగస్త్యేశ్వరస్వామి కటాక్షం

నారాయణవనం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధంగా న్న మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి స్వామిఅమ్మవార్లను శేషవాహనంపై ఊరేగించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై ఆలయ అంతర ప్రాకారంలో ఊరేగించారు. సాయంత్రం విశేష పూజల అనంతరం, మేళతాళలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటల నడుమ స్వామిఅమ్మవార్లను శేష వాహనంపై అధిష్ఠింపజేసి గ్రామంలో ఊరేగించారు. ఆలయాధికారి నాగరాజు, ఏఈవో రవి, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

బోయకొండలో కుక్కదాడి

తిరుపతి బాలుడికి గాయాలు

చౌడేపల్లె, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో ఆదివారం బాలుడిపై కుక్క దాడి చేసి గాయపరిచింది. ఆదివారం తిరుపతికి చెందిన ఫణి (10) తల్లిదండ్రులతో కలిసి అమ్మవారి దర్శనం కోసం బోయకొండకు వచ్చాడు. ఆలయ ప్రధాన కార్యాలయం వద్ద ఉండగా ఓ కుక్క బాలుడిపై దాడి చేసింది. అయితే చికిత్స కోసం బోయకొండలో వెతికినా వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చేసేది లేక ఆలయ కార్యాలయంలో ఉన్న కార్మికులు పసుపు తెచ్చి కుక్క కరచిన చోట రక్తం రాకుండా పెట్టారు. ఏమీ చేయలేక చౌడేపల్లె సీహెచ్‌సీకి వెళ్లి చికిత్స చేయించుకుని తిరుపతి వెళ్లారు. చికిత్స అందేవరకూ ఒత్తిడి పడ్డారు. నిత్యం వేలాది మంది భక్తులు తరలివచ్చే పుణ్యక్షేత్రంలో వైద్యులు అందుబాటులో లేకపోవడం ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఆలయ అధికారులు, దేవదాయ శాఖ ఉన్నతాధికారులు స్పందించి భక్తుల కోసం వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

పెనుగులాటలోనే గున్న ఏనుగు మృతి

● జిల్లా ఫారెస్ట్ అధికారి భరణి స్పష్టీకరణ



చిత్తూరు సెంట్రల్, మే 4 (ఆంధ్రజ్యోతి): పెనుగులాటలోనే ఓ గున్న ఏనుగు మృతి చెందినట్లు డీఎఫ్‌వో భరణి తెలిపారు. ఆదివారం తన చాంబర్‌లో తూర్పు ఎఫ్ఆర్వో థామస్ సుకుమార్‌తో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏనుగు మృతికి గల కారణాలు ఆమె వెల్లడించారు. పలమనేరు అటవీ ప్రాంతంలోని గౌనిచెరువు వద్ద శనివారం ఓ గున్న ఏనుగు మృతి చెందడంపై వచ్చిన పోస్టుమర్టం నివేదిక ఆధారంగా మృతికి గల కారణాలు తెలియజేశారు. ఘటన జరిగిన సమయంలో 13 ఏనుగులతోపాటు ఓ గున్న ఏనుగు గుంపుగా ఉండేవన్నారు. వీటిమధ్య జరిగిన పెనుగులాటలో గున్న ఏనుగుకు మర్మాంగాలపై బలమైన గాయాలు కావడం, శరీరం లోపలి భాగాల్లో దెబ్బలు తగలడంతో తట్టుకోలేక మృతి చెందిందని వివరించారు. పైగా ఇది పది రోజులుగా సరైన ఆహారం, నీరు తీసుకోకుండా ఉండటంతో బలహీనంగా ఉండటం, మూకుమ్మడి దాడి తట్టుకోలేక గాయాలతో మృతి చెందినట్లు స్పష్టం చేశారు. ఇటీవల నాటు బాంబు ఘటనలో కాలికి గాయమైన ఏనుగు సురక్షితంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం టేకుమంద రిజర్వు ఫారెస్టు పరిధిలో 14 ఏనుగులు ఒక గుంపుగా, మూడు ఏనుగులు మరో గుంపుగా, ఓ ఒంటరి ఏనుగు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటి కదలికలను నిత్యం పరిశీలిస్తున్నామని చెప్పారు. పలమనేరు రేంజ్‌లోని టేకుమంద రిజర్వు ఫారెస్టులో గవిని చెరువు, దేవరకొండలోని కుంటల్లో నీరు పుష్కలంగా ఉండటంతో ఏనుగులు తరచూ ఈ ప్రాంతానికి వస్తున్నాయని, ఇవి సమీప పొలాల్లోకి రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అటవీ సమీప ప్రాంతాల్లోని ప్రజలకు ఏనుగులు ద్వారా ప్రాణహాని జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, పంట నష్టం జరిగితే పరిహారం చెల్లిస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

బోర్డు తొలగించిన ఇద్దరిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), మే 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్‌పల్లికి చెందిన మధు, హేమంత్ తన భూమిలోకి అక్రమంగా చొరబడి దౌర్జన్యం చేశారని, అక్కడ పాతి ఉంచిన బోర్డును తొలగించారని భూ యజమాని సాల్మన్‌రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యూనివర్సిటీ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనపై విచారణ జరుపుతున్నారు.

నిండిన చెన్నాయిగుంట చెరువు



జోరుగా మొరవపారుతున్న చెన్నాయిగుంట చెరువు

తిరుపతి అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి చెరువులు జలకళను సంతరించుకున్నాయి. చెన్నాయిగుంట చెరువు జోరుగా మొరవపారుతూ స్థానికులను మురిపించింది. సప్తగిరికాలనీ, రణధీరపురం, మంగళం క్వార్టర్స్, తిరుమలనగర్, శెట్టిపల్లి గ్రామ పంచాయతీల పరిధిలో మూడు గంటలపాటు భారీ వర్షం కురిసింది. వర్షపు నీరంతా శెట్టిపల్లి, మంగళం, అన్నా, చెన్నాయిగుంట చెరువులకు చేరాయి. పొలాల్లోనూ నీరు నిలిచాయి. మంగళం-శెట్టిపల్లి రోడ్డుమార్గం బురదమయమైంది. ఎండ వేడిమికి అల్లాడిన ప్రజలు వర్షంతో కాస్త ఉపశమనం పొందారు.

జాతర కమిటీలో మరో ఇద్దరికి చోటు



కోడూరు బాలసుబ్రహ్మణ్యం, నందగోపాల్‌నాయుడు

తిరుపతి(కలెక్టరేట్), మే 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మంగళవారం నుంచి 14వ తేదీ వరకు జరిగే తాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని ఇటీవల 15మందితో కలెక్టర్ వెంకటేశ్వర్ కమిటీ ఏర్పాటు చేశారు. జాతర ఏర్పాట్లు, భక్తులకు సదుపాయాలు కల్పించేందుకు ఈ కమిటీని నియమించారు. తాజాగా ఈ కమిటీలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, టీడీపీ 3వ డివిజన్ అధ్యక్షుడు గాలి నందగోపాల్‌నాయుడికి చోటు కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన వినోద్‌కుమార్

తిరుపతి(నేరవిభాగం), మే 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం తిరుపతిలో చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు... కడప జిల్లా బద్వేలుకు చెందిన వినోద్‌కుమార్ (35) తిరుపతిలోని ఓటేరులో చిన్నాన్న జాన్‌మోష్ ఇంట్లో ఉంటున్నాడు. ఆదివారం ద్విచక్ర వాహనంలో మామిడి కాయల మండీ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద వేగంగా వస్తున్నాడు. అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరాహస్వామి దర్శనానికి భక్తుల రద్దీ



తిరుమల, మే 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రాధిపతి వరాహస్వామి ఆలయానికి రోజురోజుకూ భక్తుల రద్దీ పెరుగుతోంది. ప్రథమ దర్శనం,పూజ, నైవేద్యం అనే నియమ ఒప్పందంతో దానపత్రాన్ని వరాహస్వామికి రాసిచ్చి వంద అడుగుల స్థలాన్ని వేంకటేశ్వరస్వామి పొందారనేది ఐతిహ్యం. క్షేత్ర సంప్రదాయం ప్రకారం వరాహస్వామిని దర్శించుకున్న తర్వాత శ్రీవారి దర్శనం ఫలప్రదమని భక్తుల విశ్వాసం. ఈక్రమంలోనే ఇటీవల వరాహస్వామిని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతోంది. కొవిడ్ ముందు వరకు 15 వేల నుంచి 20 వేల లోపు ఉండే భక్తుల సంఖ్య ప్రస్తుతం 25 వేలకు చేరుకుంది. వారాంతాలు, విశేష పర్వదినాల్లో ఆసంఖ్య 30 వేలకు కూడా చేరుతోంది. ఒక్కో సందర్భంలో మాడవీధి ద్వారా చెక్కతేరు వరకు కూడా భక్తుల క్యూ వ్యాప్తిస్తోంది. వేకువజాము 4.30 గంటలకు ప్రారంభమయ్యే దర్శనాలు ప్రస్తుతం రాత్రి 9 గంటల వరకు కొనసాగుతున్నాయి. రద్దీరోజుల్లో భక్తులు ఎండలో,వానలో ఉండాల్సి వస్తోంది. కొంతమేరకు షెడ్ వేసినా సరిపోవడం లేదు. స్వామి ఆలయం వద్ద కూడా సౌకర్యాలు పెంచాలని భక్తులు కోరుతున్నారు.

స్టడీ సర్టిఫికెట్ల వేటలో డీఎస్సీ అభ్యర్థులు

● ప్రభుత్వ తాజా ప్రకటనతో ఊరట

తిరుపతి(విద్య), మే4 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ అభ్యర్థులకు కొత్త చిక్కొచ్చిపడింది. 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికేట్లు సమర్పించాలన్న నిబంధన పరీక్ష పెట్టింది. ముందస్తుగా ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకున్న వారికి పర్వాలేదు. లేనివారు మాత్రం ఇబ్బందులు పడుతున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో స్టడీ సర్టిఫికేట్లను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి. వేసవి సెలవులిచ్చేయడంతో పాఠశాలలు మూసివేశారు. దీంతో కొందరు అభ్యర్థులు గతంలో తాము చదివిన పాఠశాలల నుంచి స్టడీ సర్టిఫికేట్లు పొందే అవకాశం లేకుండా పోయింది. దరఖాస్తుల స్వీకరణ ఇప్పటికే ప్రారంభమైంది. మే 15తో గడువు ముగియనుంది. ఈలోపు స్కూళ్లు తెరిచే అవకాశంలేదు. అభ్యర్థుల వయో పరిమితిని 44 ఏళ్లకు పెంచారు. వీరు కనీసం 36 ఏళ్లక్రితం తాము చదివిన ప్రాథమిక, ఉన్నత పాఠశాలల నుంచి స్టడీ సర్టిఫికెట్లను తీసుకోవాల్సి ఉంది. అభ్యర్థి స్థానికతను స్టడీ సర్టిఫికేట్ల ద్వారానే నిర్ధారిస్తారు. ఈక్రమంలోనే 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికేట్లను సమర్పించాలని ప్రభుత్వం నిర్దేశించింది. కాగా ప్రభుత్వం తాజాగా చేసిన ప్రకటన అభ్యర్థులకు ఊరటనిచ్చింది. సర్టిఫికెట్ల అప్‌లోడ్ అనేది ఐచ్ఛికమని పేర్కొంది. పరీక్షానంతరం జరిగే ఎంపిక ప్రక్రియలో మాత్రం ఒరిజినల్ సర్టిఫికెట్లన్నీ చూపించాలని స్పష్టం చేసింది. సర్టిఫికెట్లు సకాలంలో దొరక్క ఇబ్బందిపడుతున్నవారంతా ప్రభుత్వ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బంది లేకుండా చూస్తాం

వేసవి సెలవుల కారణంగా పాఠశాలలు పనిచేయడంలేదు. స్టడీ సర్టిఫికేట్ల జారీలో డీఎస్సీ అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం. వేసవి సెలవులైనప్పటికీ రోజూ ఒకపూట పాఠశాల సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉండేలా చూస్తాం.

-కేవీఎన్ కుమార్, డీఈఓ, తిరుపతి జిల్లా.

తిరుచానూరులో వ్యభిచారం గుట్టు రట్టు

● పోలీసుల అదుపులో ముగ్గురు

తిరుచానూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు- ముళ్లపూడి మార్గంలోని ఓ కాలనీలో కొంతకాలంగా రమేష్ అనే వ్యక్తి బయట నుంచి యువతులను రప్పించి వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. దీనిపై తిరుచానూరు పోలీసులకు అందిన సమాచారం మేరకు వ్యభిచార గృహంపై పోలీసులు దాడిచేశారు. ఆర్గనైజర్ రమేష్‌తో పాటు హిమసాయి, మరో బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. మహిళలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కొంతకాలంగా రమేష్ వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

తిరుపతి

కరుణించిన వరుణుడు

నగరంలో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం





మధురానగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిపోయిన నీరు.. స్థానికుల అవస్థలు కొర్లగుంట జంక్షన్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

తిరుపతి అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): చాలాకాలం తర్వాత వరుణుడు కరుణించాడు. నగరంలో ఆదివారం హోరుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు ఒకటిన్నర గంటపాటు వర్షం కురవడంతో ఉక్కపోత నుంచి కాస్త ఉపశమనం లభించింది. ఉదయం నుంచి ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నా మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. ఆ వెంటనే వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులు హోరెత్తాయి. ఉరుములు, మెరుపులతో వాతావరణం భయానకంగా మారింది. నగరవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకూలాయి. దీంతో వాహనాలు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. ఈ కారణంగా పలుమార్లు నగరంలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. హోర్డింగ్‌లు ధ్వంసమయ్యాయి. వర్షపునీరు పురవీధుల్లో జోరుగా ప్రవహించింది. లోతట్టు ప్రాంతాలు, కూడళ్లు జలమయమయ్యాయి. మురుగు కాలువలు చెత్తతో నిండిపోవడంతో పొంగిపొర్లాయి. జనసంచారం స్తంభించింది. రోడ్లపై తిరుగుతున్న ప్రజలు సమీప షెల్టర్లు, గరుడ వారధి కిందకు పరుగులు తీశారు. మంగళంలో గాలులు లేకుండా ప్రశాంతంగా భారీ వర్షం కురడంతో అక్కడి ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. వర్షం ఆగిన తర్వాత కూడా చల్లటి గాలులు కొనసాగాయి. ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది. మంగళవారం తాతయ్యగుంట గంగమ్మజాతర మొదలుకానుంది. అందుకే గంగమ్మతల్లి కరుణించిందని ప్రజలు చర్చించుకోవడం వినిపించింది. కాగా గంగమ్మగుడికి సమీపంలో పురాతన రావిచెట్టు కొంత భాగం నేలకొరిగింది. అలాగే లీలామహల్, పెద్దకాపు లేఅవుట్ తదితర ప్రాంతాల్లో భారీ వృక్షాలు కూలాయి. ఆ సమయానికి జనసంచారం లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

● **కూటమి నేతల చొరవ**

తిరుపతిలో గాలివాన నేపథ్యంలో తలెత్తిన సమస్యలపై టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ చొరవ తీసుకున్నారు. ఎస్పీడీసీఎల్, కార్పొరేషన్ అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలకు పరిష్కార మార్గం చూపారు. రోడ్డుకు అడ్డుగా పడిన చెట్లను తొలగించడం, విద్యుత్‌ను పునరుద్ధరించడంలో కృషి చేశారు. కార్పొరేటర్లు ఎస్కే బాబు, నరసింహాచారి కూడా వారి డివిజన్లలో విరిగిపడిన చెట్లను యుద్ధప్రాతిపదిక సిబ్బంది, స్థానికుల సహకారంతో తొలగించారు.



గంగమ్మ గుడి వద్ద కూలిన వృక్షాన్ని తొలగించే పనులను పరిశీలిస్తున్న నరసింహయాదవ్, ఆర్సీ మునికృష్ణ





పూలమఠం వద్ద రోడ్డుపైకి చేరిన మురుగు నీరు, ఆర్టీసీ బస్టాండులోకి చేరిన వర్షపు నీరు, అబ్బన్నకాలనీలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

రేపు తిరుపతిలో ప్రత్యేక విద్యుత్ అదాలత్

తిరుపతి(ఆటోనగర్), మే 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి తిరుపతి టౌన్ డివిజన్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. డివిజన్ పరిధిలోని వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

● **విద్యుత్ సర్వీసులను ఆధార్‌తో లింక్ చేసుకోండి :**

తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సర్వీసులను ఆధార్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలని ఈఈ వి.చంద్రశేఖరరావు కోరారు. నాలుగు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసి, సంస్థకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

తిరుపతి(నేరవిభాగం), మే 4(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తిరుపతి రూరల్ పరిధిలోని వెంకటపతినగర్‌లో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. వెంకటపతినగర్‌కు చెందిన కండిగ మునస్వామికి వివాహం కాలేదు. తిరుమలలో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్నాడు. కొంతకాలంగా ఆస్మాతో బాధపడుతున్నాడు. నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి చెల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మతాంతర వివాహం చేసుకుందని

అక్కపై చెల్లి దాడి

బంగారుపాళ్యం, మే 4 (ఆంధ్రజ్యోతి): మతాంతర వివాహం చేసుకున్న అక్కపై చెల్లి దాడి చేసిన సంఘటన బంగారుపాళ్యం మండలంలోని కాటప్పగారిపల్లెలో జరిగింది. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. కాటప్పగారిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు రాజశేఖర్ పలమనేరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అదే కాలేజీలో పలమనేరుకు చెందిన మునీష్‌బాషా కుమార్తె చాందినీ కూడా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. వీరిద్దరూ ప్రేమించుకున్నారు. మరోవైపు చాందినీకి పెళ్లిచూపులు జరిగాయి. ఈ క్రమంలో రాజశేఖర్, చాందినీలు మార్చి 28వ తేదీన పెళ్లి చేసుకున్నారు. వీరు ఏప్రిల్ రెండో తేదీన ఎస్పీని కలిసి రక్షణ కోరారు. బంగారుపాళ్యం పోలీసులు ఇరు కుటుంబాలను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. ఈ నేపథ్యంలో మతాంతర వివాహం చేసుకుందని చాందినీ చెల్లెలు తస్నీయా ఆదివారం కాటప్పగారిపల్లెకు చేరుకుని అక్క, బావలపై కత్తితో దాడి చేయగా.. వారిద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. రాజశేఖర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

26 ఎర్రచందనం దుంగల స్వాధీనం



ఎర్రచందనం దుంగలను చూపుతున్న అటవీ శాఖ అధికారులు

మంగళం, మే 4(ఆంధ్రజ్యోతి) : మామండూరు నార్త్ బీట్‌లో ఆదివారం తెల్లవారుజామున అటవీశాఖ అధికారులు 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు తెల్లవారుజామున తిరుపతి-కడప మార్గంలోని మామండూరు వద్ద అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వేగంగా ఓ కారు రావడాన్ని గమనించి ఆపేందుకు ప్రయత్నించారు. కారు ఆపకుండా వేగంగా వెళ్లిపోవడంతో వెంబడించారు. స్మగ్లర్లు అంజనేయపురం చెక్‌పోస్టు వద్ద కారును వదలి పారిపోయినట్లు తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వాహనాన్ని పరిశీలించగా 26 ఎర్రచందనం దుంగలు దొరికాయని వెల్లడించారు. వీటి బరువు 332 కిలోలు ఉంటాయని, పారిపోయిన స్మగ్లర్ల కోసం గాలిస్తున్నామని అన్నారు. ఈ దాడుల్లో మామండూరు సెక్షన్ డీఆర్వో గౌస్ కరీం, ఎఫ్‌బీవోలు శరవణకుమార్, జాన్ శ్యాముల్, ప్రొటెక్షన్ వాచర్స్ బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



భగీరథ మహర్షికి నివాళులర్పిస్తున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి(కలెక్టరేట్), మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఆదివారం భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి డీఆర్వో నరసింహులు పూలమాల వేసి నివాళులర్పించారు. డీఆర్వో మాట్లాడుతూ దివి నుంచి భువికి గంగను తీసుకొచ్చిన భగీరథ మహర్షి పట్టుదల అసామాన్యమని, స్ఫూర్తిదాయకమని తెలిపారు. నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోత్స్న, లక్ష్మీనారాయణ, కలెక్టరేట్, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీకి మణి రాజీనామా

● భూమన తీరు నచ్చకే బయటకు వచ్చినట్లు వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న మణి

తిరుపతి(ఆటోనగర్), మే 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.వి.ఎస్.మణి ఆదివారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాకు వెల్లడించారు. 2011 నుంచి తాను పార్టీ కోసం ఎంతో కష్టపడ్డానన్నారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు ప్రతి కార్యక్రమంలోనూ పాల్గొన్నానని చెప్పారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి దృష్టికి ప్రజల సమస్యలు తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికీ ఆయన తీరులో మార్పు రాలేదని, అందుకే పార్టీకి రాజీనామా చేశానని తెలిపారు. ఆయనతో పాటు లీగల్ సెల్ సభ్యులు జయరామ్‌యాదవ్ కూడా రాజీనామా చేశారు.

రాష్ట్ర వైద్యమండలి చైర్మన్‌కు సన్మానం



డాక్టర్ శ్రీహరిరావును సన్మానిస్తున్న బీజేపీ నేతలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), మే 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య మండలి నూతన చైర్మన్, తిరుపతికి చెందిన బీజేపీ నేత డాక్టర్ శ్రీహరిరావును ఆ పార్టీ నాయకులు సోమవారం సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు. శ్రీహరిరావు సమాజానికి చేసిన సేవలను గుర్తించి ప్రభుత్వం ఆయనకు ఉన్నత స్థానం కట్టబెట్టిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, మల్లారపు రవిప్రసాద్, కరుణాకరరెడ్డి, రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

నగలు, నగదు చోరీ

తిరుపతి(నేరవిభాగం), మే 4(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి నెల్లూరుకు వెళుతున్న ఒక ప్రైవేటు బస్సులో నగలు, నగదు అపహరించిన ఘటన శనివారం రాత్రి బంగారుపాళెం వద్ద చోటు చేసుకుంది. బాధితురాలు ఈస్ట్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. గూడూరుకు చెందిన అమరావతి గతనెల 24న బెంగళూరులోని తన కుమార్తె వద్దకు వెళ్లింది. అక్కడి నుంచి శనివారం రాత్రి ప్రైవేటు బస్సులో వస్తోంది. రాత్రి 2.15 గంటలకు గాఢ నిద్రలో ఉండగా హ్యాండ్ బ్యాగును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. మెలకువ వచ్చి చూడగా బ్యాగు బస్సులోని ఆఖరు సీటు వద్ద పడి ఉంది. అందులో ఉన్న రెండు చిన్న చైన్లు, జత కమ్మలు, రూ.20వేల నగదు కనిపించలేదు. డ్రైవర్ రవికుమార్, క్లీనర్ రెహముద్దీన్‌లపై అనుమానమున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఎస్ఐ బాలకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీబీఎస్‌లో బస్సుల కొరత




బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

తిరుపతి(ఆర్టీసీ), మే 4(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్ స్టేషన్‌లో ఆదివారం ఆర్టీసీ బస్సుల కొరత ఏర్పడింది. ప్రధాని సభకు తరలివెళ్లిన డ్రైవర్లు శనివారం విశ్రాంతి తీసుకున్నారు. దీంతో డిపోకు 20బస్సుల చొప్పున పరిమితమయ్యాయి. ఈ ప్రభావం సెంట్రల్ బస్ స్టేషన్‌పై పడింది. సకాలంలో బస్సులు రాకపోవడంతో ప్రయాణికులకు గంటల కొద్దీ నిరీక్షణ తప్పలేదు. అప్పుడప్పుడు వచ్చిన బస్సులో సీట్ల కోసం పోటీపడడం కనిపించింది. కొంతమంది ప్రైవేటు వాహనాల్లో వెళ్లిపోయారు. బస్సులకు సంబంధించిన సమాచారం చెప్పేవారే లేరంటూ ఆగ్రహించారు. ప్రతి వారాంతంలోనూ ఏదో ఒక కారణంతో బస్సుల కొరత ఏర్పడుతోందని అంటున్నారు.

రోడ్డు బ్లాక్ చేసి భవన నిర్మాణ పనులు

వాహనదారుల ఇబ్బందులు



రాఘవయ్యపేట రోడ్డు మధ్యలో ఉన్న ఇసుక, కంకర, యంత్రాలు

సూళ్లూరుపేట, మే 4(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి రాఘవయ్యపేటకు వెళ్లే రోడ్డులో ఓ భవన భవన నిర్మాణం కోసం ఇసుక, కంకర పోసి బ్లాక్ చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి కోళ్లమిట్ట, పాలవల్లీ వారివీధి, డీఆర్‌డీఎల్ షార్ కాలనీకి వెళ్లే ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఓ భవన నిర్మాణం చేపట్టిన వ్యక్తి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా శనివారం రాత్రి నుంచి రోడ్డును బ్లాక్ చేసి పనులు చేసుకొంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. శనివారం అర్ధరాత్రి పాలవల్లీవారివీధిలో ఓ వ్యక్తికి ఆరోగ్యం బాగలేదని ప్రభుత్వాస్పత్రి వద్దనున్న ప్రైవేట్ అంబులెన్స్‌ను రప్పించారు. రాఘవయ్యపేట ప్రధాన రోడ్డులో కంకర, ఇసుక పోసి బ్లాక్ చేసి ఉండడంతో అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి. చేసేదేమి లేక అంబులెన్స్ వెనక్కి వెళ్లి షార్ వై జంక్షన్ మార్గం గుండా పోవాల్సి వచ్చింది. రైల్వేగేటు తూర్పు వైపు నుంచి బజారు సెంటర్‌కు రావాలన్నా, బజారు సెంటర్ నుంచి అటువైపు వెళ్లాలన్న రాఘవయ్యపేట రోడ్డు ప్రధాన మార్గం కావడంతో నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. అలాంటి రోడ్డును వ్యక్తిగత భవన నిర్మాణం కోసం ముందురోజు రాత్రి నుంచి బ్లాక్ చేయడం ఏమిటని స్థానికులు ప్రశ్నించారు. మున్సిపాలిటీ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యను వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని, బ్లాక్ చేసిన రోడ్డులో ఇసుక, కంకర తొలగింపచేస్తామన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ



ఆంజనేయస్వామి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

గూడూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మకాలనీలోని సునీల్ కుమార్ నగర్‌లో నూతనంగా నిర్మించిన కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారి నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంబాభిషేక పూజలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచన, క్షీరాధివాసం, జలాధివాసం పూజలు జరిపారు. వేదపండితుల మంత్రోచరణల నడుమ శాస్త్రోపేతంగా హోమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో శివకుమార్, హరి, గోపాల్‌రెడ్డి, విజయ్‌భాస్కర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పెంచలయ్య, సురేంద్ర, దేవాసిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్



పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

గూడూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో నిర్వహించిన నీట్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. మధ్యాహ్నం 2నుంచి 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచే విద్యార్థులను విద్యార్థులను క్షుణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. 409 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 398 మంది హాజరయ్యారని కోఆర్డినేటర్, తహసీల్దారు చంద్రశేఖర్ తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

పిడుగుపాటుకు గేదె మృతి

గూడూరు, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో ఆదివారం పిడుగుపాటుకు గేదె మృతి చెందింది. చెన్నూరు ముస్లిం వీధికి చెందిన శ్రీనివాసులు సమీపంలోని పొలాల్లోకి గేదెలను మేతకు తోలుకెళ్లాడు. అదే సమయంలో పిడుగు పడడంతో గేదె మృతి చెందింది.

చిల్లకూరులో ఆవుదూడ..

చిల్లకూరు: మండలంలోని వడ్డికండ్రిగ గ్రామంలో పిడుగు పడడంతో ఆవుదూడ మృతి చెందాయి. గ్రామానికి చెందిన పాడిరైతు ఇంటి సమీపంలో ఆవు దూడను కట్టేసి ఉండగా పిడుగు పడడంతో మృతి చెందాయి.

చిట్టేడులో ఉచిత వైద్య శిబిరం



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

కోట, మే 4 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడు ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. రాఘవపురం గ్రామానికి చెందిన ప్రముఖ బిల్డర్ మర్రిబోయిన రాజేంద్ర ఆధ్వర్యంలో గూడూరుకు చెందిన ఆర్‌కే మల్టీ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు త్రివిక్రమ్, కీర్తి రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచు రాఘవయ్య, గోపాల్, సుబ్బారావు, కృష్ణపట్నం చంద్రశేఖర్, తలారి వెంకటేశ్వర్లు, వెంకటరమణయ్య, యాకసిరి చిన్నయ్య, వెంకటేశ్వర్లు, దాసరి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయిబాబా ఆరాధన పూజలు

గూడూరు అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక కుమ్మరవీధిలోని ప్రేమ సుధా సత్యసాయి మందిరంలో ఆదివారం సత్యసాయిబాబా సమితి ఆధ్వర్యంలో ఆరాధనోత్సవాలు నిర్వహించారు. భజనలు చేసి స్వామివారి కీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకుని ప్రశాంత జీవనం సాగించాలన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు యోగా, ధ్యానంపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో ప్రతాప్ కుమార్, సురేష్, గౌతమి, సునంద, మల్లికార్జున, సుబ్బారావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సత్యసాయి ఆరాధన పూజల్లో భక్తులు

రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

దొరవారిసత్రం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మావిళ్లపాడు గ్రామానికి చెందిన బట్టా చంద్రయ్య(60) రైలు ఢీకొని మృతి చెందాడు. ఆదివారం పొలాల్లోకి వెళ్లిన చంద్రయ్య పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో దుర్మరణం పాలయ్యాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సూళ్లూరుపేట రైల్వే పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



చంద్రయ్య (ఫైల్‌ఫొటో)

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడి మృతి

తడ, మే 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. తమిళనాడు ఆరంబాకం బాట కుప్పం ప్రాంతానికి చెందిన దేశప్పన్(14) తడ మండలం వాటంబేడు కుప్పంలో ధర్మరాజస్వామి ఉత్సవాల్లో పాల్గొనేందుకు గత నెల 29న బంధువుల ఇంటికి వెళ్లాడు. స్నేహితుడు శివలింగంతో కలిసి మోటరు సైకిల్‌పై సూళ్లూరుపేటకు వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులకు సూళ్లూరుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం ఇరువురినీ చెన్నైకి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ దేశప్పన్ శనివారం మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు తడ పోలీసులు కేసు నమోదు చేశారు.





కాళంగి బ్రిడ్జి రోడ్డులో పార్కింగ్ చేసి ఉన్న బస్సులు - పార్కింగ్ చేసిన బస్సుల మధ్య వంట చేస్తున్న భక్తులు

రూటు మార్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు

చెంగాళమ్మ ఆలయానికి ఎగువ రోడ్డులో పార్కింగ్ ● భక్తులకు తప్పని ఇబ్బందులు

సూళ్లూరుపేట, మే 4(ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లు చెంగాళమ్మ ఆలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసే పరిశ్రమలకు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యజమానులు రూటు మార్చారు. ఎవరెన్ని ఆంక్షలు పెట్టిన మేము రోడ్డు ఎక్కడ ఖాళీ కనిపిస్తే అక్కడ అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తామన్న చందంగా వ్యవహరిస్తున్నారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా పదుల సంఖ్యలో బస్సులను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. చెంగాళమ్మ ఆలయం ఎగువన కాళంగి నది బ్రిడ్జిని ఆనుకొని జాతీయ రహదారి ప్రారంభంలో ఉన్న ఆలయ ముఖద్వారా ఆర్చి వరకు రోడ్డుకు ఇరువైపులా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను పార్కింగ్ చేస్తున్నారు. ఆదివారం, శుక్రవారం అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు ఇక్కడ రోడ్డుకు ఇరువైపులా షామియానాలు వేసుకొని పొంగళ్లు పెట్టుకునేవారు. ప్రస్తుతం వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో భక్తులు పొంగళ్లు పెట్టుకోలేని పరిస్థితి నెలకొంది. ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. కొందరు అమ్మవారికి పొంగళ్లు పెట్టేందుకు వెళ్లగా అక్కడకు బస్సులు పార్కింగ్ చేసి ఉండడంతో వెనుదిరగాల్సి వచ్చింది. ఆలయం అనుకొని కాళంగి బ్రిడ్జి నుంచి జాతీయ రహదారి వద్దనున్న అమ్మణ్ణి ఆర్చి వరకు రోడ్డుకు ఇరువైపులా పెద్దపెద్ద వృక్షాలు ఉండడంతో భక్తులకు అన్ని విధాలా సౌకర్యంగా ఉండేది. భక్తులు పొంగళ్లు పెట్టుకునేందుకు అనువైన ప్రాంతం ప్రైవేట్ బస్సుల పార్కింగ్‌గా మారడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇవతలి వైపు నుంచి అవతలకు...

మొదట చెంగాళమ్మ ఆలయం వద్ద రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసుకొనేవారు. భక్తులు, ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవడంతో పోలీసులు నో పార్కింగ్ బోర్డులు పెట్టి వాహనాలు నిలిపితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. దీంతో ట్రావెల్స్ బస్సుల యజమానులు మకాం మార్చి ఆలయం అవతల వైపు కాళంగి బ్రిడ్జి ఆనుకొని రోడ్డుకు ఇరువైపులా బస్సులను పార్కింగ్ చేసుకుంటున్నారు. ఆదివారం ఆలయానికి వచ్చిన పలువురు భక్తులు ఇదేమి నిర్వాకమంటూ ఆలయంలో పనిచేసే సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. పోలీసులు స్పందించి బ్రిడ్జికి అవతలి వైపు కూడా ప్రైవేట్ బస్సులను పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.





గూడూరు ఆర్టీసీ బస్టాండు రోడ్డు, ఐసీఎస్ రోడ్డులో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

కుండపోత వర్షం

గూడూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుని గాలులు, ఉరుములు, మెరుపులతో గంటకు పైగా వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 3:30 గంటల నుంచి ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది. 4:30 గంటల నుంచి గాలులు, మెరుపులు, ఉరుములతో గంటకు పైగా కుండపోత వర్షం కురిసింది. ఆర్టీసీ బస్టాండు రోడ్డు, ఐసీఎస్ రోడ్డు, చర్చివీధి, ఆస్పత్రి రోడ్డు, శాంతినగర్ అండర్ బ్రిడ్జి, మాళవ్యానగర్ ప్రాంతాల్లో వర్షపునీరు రోడ్లపై ప్రవహించడంతో పాదచారులు, వాహన దారులు ఇబ్బందులు పడ్డారు. దాదాపు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

చిల్లకూరు: మండలంలో గంటపాటు ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వచేరడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

నాయుడుపేట: ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడుతున్న జనానికి ఆదివారం కురిసిన వర్షంతో ఉపశమనం కలిగింది. మధ్యాహ్నం వరకు భానుడి ప్రతాపంతో ఎండ అధికంగా ఉన్నా ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటు చేసుకుని ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు కూడలి ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో ఆ శాఖ సిబ్బంది మరమ్మతులు చేపట్టి సరఫరా పునరుద్ధరించారు.

పెళ్లకూరు: మండలంలో ఉరుములు, మెరుపులతో తేలికపాటి జల్లులు పడ్డాయి. ఉదయం నుంచి ఎండ ఉన్నా సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులతో కూడిన వర్షం పడింది.

వెంకటగిరి టౌన్: పట్టణంలో ఉరుములతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ ఉన్నా మధ్యాహ్నం తరువాత మబ్బులు కమ్ముకున్నాయి. ఉరుములతో పాటు మోస్తరు వర్షం పడింది.

కోట: మండలంలో ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. గాలులు వీయడంతో పలుచోట్ల చెట్లు కూలిపోగా, అరటి తోటలు దెబ్బతిన్నాయి. విద్యానగర్, చంద్రశేఖరపురం, ఉనుగుంటపాళెం, రాఘవపురం, చిట్టేడు గ్రామాల్లో మామిడి కాయలు రాలిపోయాయి. మండల పరిధిలోని శ్రీనివాససత్రం, గోవిందపల్లిపాళెం వద్ద సముద్రం కల్లోల భరితంగా మారింది.

బాలాయపల్లి: మండలంలో ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. కోటంబేడు గ్రామంలో అరటి చెట్లు నేలకొరిగాయి. పిగిలాం, నిండలి గ్రామాల్లో మామిడి కాయలు రాలిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





చిల్లకూరులోని దళితవాడలో నిలిచివున్న వర్షపునీరు - నాయుడుపేట పాత వెంకటగిరి రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

ఉదయం నిప్పుల కొలిమి... సాయంత్రం చిరు జల్లులు





ఎండ తీవ్రతతో మధ్యాహ్నం 1 గంటకు నిర్మానుషంగా ఉన్న బాపూజీ వీధి - సాయంత్రం 4 గంటలకు చిరు జల్లులు

సూళ్లూరుపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో పట్టణంలో ఆదివారం విభిన్న వాతావరణం చోటు చేసుకుంది. ఉదయం 7 గంటల నుంచి భానుడు భగభగలతో ఎండ నిప్పుల కొలిమిని తలిపించింది. తీవ్ర ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. పట్టణంలో ప్రధాన వీధులన్నీ నిర్మానుషంగా కనిపించాయి. మధ్యాహ్నం 2 గంటలకు కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఆకాశం మేఘమృతమై ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు పడ్డాయి. ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది.





ఘటం కుండకు పూజలు చేస్తున్న భక్తులు - బజారు వీధిలో దున్నపోతు ఊరేగింపు

ఘటంతో పోలేరమ్మ జాతర ప్రారంభం

నాయుడుపేట/టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం ఉదయం ఘటంతో ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద కమిటీ అధ్యక్షుడు నానబాల సుబ్బారావు, పెదకాపు అరవభూమి శ్రీనివాసులురెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘటంతో జాతరను ప్రారంభించారు. మంగళ వాయిద్యాల నడుమ ఘటం కుండలు, దున్నపోతుతో పట్టణంలో సంచరిస్తూ మడి బియ్యం సేకరించారు. మహిళలు ఘటానికి, దున్నపోతుకు ప్రత్యేక పూజలు చేసి మడిబియ్యం సమర్పించారు. ఆదివారం, సోమవారం ఘటోత్సవం నిర్వహిస్తారు. మంగళవారం రాత్రి అమ్మవారి నిలుపు, బుధవారం జాతర నిర్వహించనున్నట్లు ఈవో రవికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, కమిటీ సభ్యులు మణి, ధనుంజయ, సాయి, శ్యామ్, రామారావు, స్థానికులు చిరంజీవి ఆచారి, అంజయ్య, బాబు, జనార్దన యాదవ్, విన్నమాల గ్రామస్తులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

చిల్లకూరు, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లవోలు గ్రామంలో ఆదివారం పూరిల్లు దగ్ధమైంది. స్థానికుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన నాగభూషణం ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి మంటలు రావడంతో పూరిల్లు కాలిపోయింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అందుపు చేశారు. ఇంట్లోని బంగారు నగలు, నగదు, గృహోపకరణాలు కాలిపోవడంతో సుమారు రూ.4లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.

నేత్రదానం

సూళ్లూరుపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వహిస్తున్న నేత్రదానం 463కి చేరింది. పట్టణంలోని గాండ్లవీధికి చెందిన నాపా మునస్వామి(57) ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో చెన్నై శంకర నేత్రాలయకు దానం చేశారు.



మునస్వామి (ఫైల్‌ఫొటో)

పాత్రదారుల అరెస్టు సరే...

సూత్రధారుల సంగతేమిటి?

టీడీపీ నేత హత్య వెనుక కుట్రకోణం వెలుగులోకి వచ్చేనా!

నాయుడుపేట టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం అత్తివరం గ్రామానికి చెందిన టీడీపీ నేత ఎల్లు గురుమూర్తి హత్య కేసులో నలుగురిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అయితే వీరితో మృతుడు గురిమూర్తికి నేరుగా ఎలాంటి వివాదాలు లేవు. అత్తివరం గ్రామంలో ఇరువర్గాల మధ్య వివాదాలు ఉన్న నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడిచేసుకుని కేసులు నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలో ఏప్రిల్ 27వ తేదీ రాత్రి గురుమూర్తి, అత్తివరం గ్రామానికే చెందిన అనిల్‌రెడ్డితో కలిసి మోటరు సైకిల్‌పై నాయుడుపేట నుంచి ఇంటికి వెళుతుండగా ద్వారకాపురం సమీపంలో మినీవ్యానుతో వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో గురుమూర్తి మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన మినీ వ్యాను, అందులోని ముగ్గురితో పాటు గురుమూర్తిని బైక్‌లో వెంబడించిన మరో వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అయితే మృతుడి కుమారుడు గురుతేజ తన తండ్రిని పథకం ప్రకారం హత్య చేయించారని, అందులో తమ సామాజిక వర్గానికి చెందిన వారే ప్రధాన పాత్ర పోషించారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అత్తివరం గ్రామానికి చెందిన 13మందిపై కేసు నమోదు చేశారు. అయితే వ్యానుతో వెనుక నుంచి ఢీకొట్టి హత్య చేసిన ఘటనలో పాలుపంచుకున్న నలుగురిని మాత్రమే శనివారం పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన సూత్రధారులను విచారణ పేరుతో స్టేషన్‌కు పిలిపించి పంపించేశారు. తమ సామాజిక వర్గానికి చెందిన వారే తన తండిని హత్య చేయించారని మృతుడి కుమారుడు గురుతేజ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ మరుసటి రోజే 13మందిపై కేసు కూడా నమోదు చేశారు. అలాగే హత్యకు ఉపయోగించిన వాహనాన్ని రెండు రోజుల ముందు గురుమూర్తి ప్రత్యర్థులు కొనుగోలు చేసినట్లు అగ్రిమెంట్ పేపర్లను పోలీసులు స్వాధీనం చేసుకోవడం కూడా సూత్రదారుల ప్రమేయం ఉందనడానికి బలం చేకూరుస్తోంది. అయితే కేవలం నలుగురు నిందితులనే అరెస్టు చేయడం వెనుక ఆంతర్యం ఏమిటనేది చర్చనీయాంశం అయింది.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న భక్తులు

తడ, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాటంబేడుకుప్పంలో ఉన్న పంచపాండవ ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు ఆదివారం అగ్నిగుండ ప్రవేశం జరిగింది. ఉదయం నుంచి స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి పోతురాజును శిరస్సుపై ఉంచుకుని గ్రామశివారు నుంచి ఊరేగింపుగా భక్తులు తరలివచ్చారు. అక్కడ స్వామివారికి పూజలు నిర్వహించి అగ్నిగుండ ప్రదేశానికి చేరుకున్నారు. అక్కడ శాస్త్రోత్తంగా పూజలు నిర్వహించి అగ్నిగుండ ప్రవేశం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో అగ్నిగుండాన్ని తాకి మొక్కులు తీర్చుకున్నారు. చివరిగా అర్ధరాత్రి సమయంలో స్వామివారి తెప్పోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చెన్నై శక్తి ఈవెంట్స్ పాటకచ్చేరి నిర్వహించింది. ఈ కార్యక్రమాలకు విచ్చేసిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ అధికార ప్రతినిధి సుధాకర్‌రెడ్డి, నాయకులు పార్థసారధి, ఆకుతోట రమేష్, సెల్వం, మాధవనాయుడు తదితరులను ఆలయ కమిటీ నిర్వాహకులు బొమ్మల ఫణి, శ్రీధర్, ధనుంజయలు శాలువాలతో సత్కరించారు.

26 ఎర్రచందనం దుంగల స్వాధీనం



ఎర్రచందనం దుంగలను చూపుతున్న అటవీ శాఖ అధికారులు

మంగళం, మే 4(ఆంధ్రజ్యోతి): మామండూరు నార్త్ బీట్‌లో ఆదివారం తెల్లవారుజామున అటవీశాఖ అధికారులు 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు తెల్లవారుజామున తిరుపతి-కడప మార్గంలోని మామండూరు వద్ద అధికారులు వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వేగంగా ఓ కారు రావడాన్ని గమనించి ఆపేందుకు ప్రయత్నించారు. కారు ఆపకుండా వేగంగా వెళ్లిపోవడంతో వెంబడించారు. స్మగ్లర్లు ఆంజనేయపురం చెక్‌పోస్టు వద్ద కారును వదలి పారిపోయినట్లు తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వాహనాన్ని పరిశీలించగా 26 ఎర్రచందనం దుంగలు దొరికాయని వెల్లడించారు. వీటి బరువు 332 కిలోలు ఉంటాయని, పారిపోయిన స్మగ్లర్ల కోసం గాలిస్తున్నామని అన్నారు. ఈ దాడుల్లో మామండూరు సెక్షన్ డీఆర్వో గౌస్ కరీం, ఎఫ్‌బీవోలు శరవణకుమార్, జాన్ శ్యాముల్, ప్రొటెక్షన్ వాచర్స్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం బృహత్తర బాధ్యత



రక్తదానం చేస్తున్న యువకులు

శ్రీకాళహస్తి, మే 4(ఆంధ్రజ్యోతి): రక్తదానం బృహత్తర బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావిస్తే అత్యవసర పరిస్థితుల్లో ఎంతో మందికి ప్రయోజనం చేకూరుతుందని ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి అన్నారు. పట్టణంలో యువతరం సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆర్డీవో ప్రారంభించారు. సుమారు 58 మంది యువకులు రక్తదానం చేశారు. వారికి ఆర్డీవో సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువతరం సేవా సమితి పది సంవత్సరాలుగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రక్తదానం చేయడం ఒకరి ప్రాణాన్ని నిలబెటడమన్నారు. న్యాయవాది రాజేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు స్వర్ణమూర్తి, కల్పన, యువతరం సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

హెల్పింగ్‌హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయం



సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ తదితరులు

శ్రీకాళహస్తి, మే 4(ఆంధ్రజ్యోతి): హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. పట్టణంలోని నగరి వీధిలో ఉన్న సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దివ్యాంగులు, వృద్ధులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంస్థకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బొజ్జల బృందమ్మ, రిషితారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, నాయకులు చెంచయ్యనాయుడు, హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపకులు మునీర్‌బాషా, సభ్యులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

గోడౌన్‌లో నగదు చోరీ కేసు

ఇద్దరి అరెస్టు: నగదు, బైక్ స్వాధీనం



నిందితులను, పట్టుబడిన నగదును చూపుతున్న సీఐ తదితరులు

పుత్తూరు అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి నగదు, బైక్ స్వాధీనం చేసుకున్నట్టు సీఐ సురేంద్ర నాయుడు చెప్పారు. నిందితుల అరెస్టు చూపి వివరాలను మీడియాకు తెలిపారు. గత నెల 19న పట్టణంలోని ఈశ్వరీ కల్యాణ మండపం పక్కన ఉన్న మీనాక్షీ ఏజెన్సీ పాన్ మసాలా హోల్ సేల్ గోడౌన్‌లో రూ.6.30 లక్షల నగదు చోరీకి గురైంది. పిచ్చాటూరు మండలం శేషంబేడుకు చెందిన కైలాసం ఠాగూర్, బుడుగు పాండియన్ మరో ఇద్దరు దినేష్, జగన్ సాయంతో చోరీకి పాల్పడ్డారు. జల్సాలకు, బెట్టింగులకు అలవాటు పడిన కైలాసం ఠాగూర్ అప్పులు చేశాడు. రుణదాతలు ఒత్తిడి చేయడంతో పాండియన్, గుమ్మడిపూండికి చెందిన దినేష్, జగన్‌ను కలుపుకుని చోరీకి పథకం రచించారు. గత నెల 19న మీనాక్షి ఏజెన్సీలో రూ.6.30 లక్షలు చోరీ చేశారు. ఇందులో ఠాగూర్ రూ.2.20 లక్షలు, పాండియన్ రూ.2.10 లక్షలు, దినేష్ రూ.లక్ష, జగన్ రూ.లక్ష చొప్పున పంచుకున్నారు. చోరీ చేసిన రోజునే చెన్నైకి వెళ్లిపోయారు. తమపై అనుమానం రాలేదని నిర్ధారించుకుని ఠాగూర్, పాండియన్ రెండు రోజుల క్రితం స్వగ్రామాలకు వచ్చారు. ఆదివారం చెన్నైలో ఉన్న దినేష్ జన్మదినం కావడంతో పార్టీ చేసుకోవడానికి ఠాగూర్, పాండియన్ బయలుదేరారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు నారాయణవనం జంక్షన్ వద్ద వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా చోరీ చేసినట్టు అంగీకరించారు. వారినుంచి రూ.2 లక్షలను, దోపిడీకి వినియోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్‌ఐ ఓబయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సదాశివ కోన జమా ఖర్చులను తేల్చండి



జమాఖర్చులపై ఈవోను ప్రశ్నిస్తున్న శివభక్తులు

వడమాలపేట, మే 4(ఆంధ్రజ్యోతి): సదాశివుడి శివరాత్రి ఆదాయాన్ని దేవదాయ, ధర్మాదాయ ఈవో ఇష్టారాజ్యంగా ఖర్చు చేయడంపై భక్తులు మండిపడ్డారు. సుమారు రూ.3 లక్షలకు పైగా అవినీతి జరిగిందంటూ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు భక్తులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన లెక్కలను బహిరంగంగా చూపించాల్సిందిగా ఎండోమెంట్ అధికారులను కోరారు. ఈక్రమంలో ఆదివారం శివభక్తులు, స్థానికులతో ఆలయ అధికారులు సమావేశం ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 27న మహాశివరాత్రి సందర్భంగా రూ.11,87,675 ఆదాయం వచ్చింది. అందులో రూ.11,15,609 మేరకు ఖర్చు చేసినట్లు అధికారులు తేల్చారు. అయితే రోడ్డు మరమ్మతుల పేరిట రూ.40వేలు, ఆలయ అలంకరణలో రూ.20వేలు, జీపు బాడుగల పేరుతో రూ.39 వేలు, సిబ్బంది రవాణా ఖర్చుల కింద రూ.20 వేలు, ఎండోమెంట్ శాఖ పేరు మీదగా అదనంగా రూ.75 వేలు, ఇతరత్రా ఖర్చులు చూపుతూ... మొత్తానికి రూ.3,43,350 మేర అక్రమాలు జరిగాయని సమావేశంలో నిర్ధారించారు. ఎండోమెంట్ పుత్తూరు లోకల్ టెంపుల్స్ ఈవో జయకృష్ణను నిలదీశారు. దుర్వినియోగమైన సొమ్మును రికవరీ చేసి, సంబంధిత ఈవోపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని శ్రీధర్ రాజు, ఢిల్లీ ప్రసాద్, సురేష్ కుమార్, శంకరయ్య, సదాశివకోన ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ శేషాద్రి యాదవ్, అన్నదాన సమాజ సేవకులు, ప్రసాద వితరణ సమాజ సేవకులు చెప్పారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

వడమాలపేట, మే 4(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ ధర్మారెడ్డి చెప్పారు. ఆదివారం ఎస్వీపురం టోల్‌ప్లాజా వద్ద సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు హెల్మెట్ ధరించి ప్రయాణించాలని అవగాహన కల్పించారు. రాత్రి ప్రయాణాల్లో జాగ్రత్తగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో విశ్రాంతి తీసుకుని రాకపోకలు సాగించాలని సూచించారు.

చిన్ననాటి మధుర స్మృతుల్లో పూర్వ విద్యార్థులు



వడమాలపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1999-2000లో టెన్త్ చదివిన విద్యార్థులు తమ చిన్న నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. 25 ఏళ్ల తరువాత కలుసుకుని గత మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. వందమంది విద్యార్థులు ఒక్క చోట చేసి నాటి గురువులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని తీర్మానించారు. హేమంత్, తేజ, శ్రీనివాసులు, రమేష్, పరమేశ్వర్, రాధిక, శ్రావణి, విజయలక్ష్మి తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ఆదిశేషుడిపై సదాశివుడి దివ్య స్వరూపం



పుత్తూరు టౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షిదేవి సమేత సదా శివేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామిఅమ్మవార్లు ఆదిశేషుడిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం 7.30 గంటలకు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పుష్పాలతో అలంకరించి ఆదిశేష వాహనంపై అధిష్ఠింపజేసి పట్టణంలో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు ఘన సన్మానం

ఏర్పేడు, మే 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్రను ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి ఆదివారం కలిసి ఘనంగా సన్మానించారు. ఇటీవల ఎమ్మెల్సీగా రవిచంద్ర ప్రమాణ స్వీకారం చేశారు. ఈక్రమంలో నెల్లూరులోని బీద రవిచంద్ర స్వగృహంలో ఆయన్ను గురవారెడ్డి కలిసి శ్రీకాళహస్తీశ్వరుడి ప్రసాదాలను అందించి సత్కరించారు.

ఇష్టానుసారంగా తవ్వకాలు... రాకపోకలకు అష్టకష్టాలు



చిన్నపాండూరు సమీపంలో చేపట్టిన తవ్వకాలు

వరదయ్యపాళెం, మే 4(ఆంధ్రజ్యోతి): రహదారుల పక్కనే కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. సత్యవేడు - వరదయ్యపాళెం మార్గంలో చిన్న పాండూరు సమీపంలో తవ్వకాలు చేపడుతున్నారు. గ్యాస్ పైప్‌లైన్ భూగర్భంలో అమర్చడానికి పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ సకాలంలో పనులు పూర్తి చేయకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. తవ్విన మట్టిని రోజుల తరబడి రహదారికి పక్కనే వేస్తుండడంతో వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సందర్భంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తుతోంది. ఈ మార్గం మీదుగా శ్రీసిటీ, అపోలో, హీరో వంటి పరిశ్రమలకు నిత్యం విధులకు వెళ్లే కార్మికులు, ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు ఇకనైనా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఈదురు గాలులతో వర్షం





కేవీబీపురంలో రోడ్డుపై నిలిచిన నీరు - కన్నావరంలో రోడ్డుపై కూలిన చెట్టు

వరదయ్యపాళెం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం ఈదురుగాలులతో వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు చిన్న పాండూరు, యానాదివెట్టు, పాదూరు, రాచర్ల, అంబికాపురం, వరదయ్యపాళెం, కంచరపాళెం, కదూరు పంచాయతీల్లో ఉరుములతో వర్షం కురిసింది. కాగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

కేవీబీపురం (ఆంధ్రజ్యోతి): మండలంలో మధ్యాహ్నం గాలులతో మోస్తరు వర్షం కురిసింది. దీంతో సబ్‌స్టేషన్ సమీపంలో చెట్టు కూలింది. దీంతో పాటు ప్రధాన రహదారిపై చెరువును తలపించేలా వర్షపునీరు చేరి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించింది. అక్కడక్కడా మామిడి కాయలు రాలాయి. వర్షంతో ప్రజలు ఎండ నుంచి ఉపశమనం పొందారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త గొల్లకండ్రిగ, పీజీ కండ్రిగ, అద్దాలమేడ, పులియంగుంట పరిసరాల్లో ఆదివారం సాయంత్రం 3 గంటల ప్రాంతంలో మోస్తరు వర్షం కురిసింది. అయితే గాలులకు కొత్త గొల్లకండ్రిగ సమీపంలో ఏడు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలాయి. ట్రాన్స్‌కో ఏఈ సుబ్రహ్మణ్యంరెడ్డికి గ్రామస్తులు సమాచారం అందించడంతో సాయంత్రం 5 గంటలకల్లా సరఫరాను పునరుద్ధరించారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు బలమైన గాలులు వీచి, వర్షం కురిసింది. గాలుల ధాటికి పలు చోట్ల చెట్లు నేలవాలాయి. ఉద్యావన రైతులకు నష్టం వాటిల్లింది. ప్రధానంగా మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. కన్నావరంలో చెట్లు, చమర్తికండ్రిగ, ఆంబాకం, పుదుకుప్పం గ్రామాల్లో పలు విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి.

కార్డన్ సెర్చ్



బుచ్చినాయుడుకండ్రిగ, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అరుంధతీయవాడలో ఎస్‌ఐ విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కార్డన్ సెర్చ్‌ను చేపట్టారు. తనిఖీల్లో సరైన పత్రాలు లేని పలు బైకులను స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లాలని పోలీసులు తెలిపారు.

పోలేరమ్మకు పొంగళ్లు



వరదయ్యపాళెం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండంబట్టులో పోలేరమ్మ ఆలయంలో స్థానికులు పొంగళ్లు పెట్టారు. అలాగే గ్రామదేవత వేపచెట్టుకు గ్రామస్తులు అంబళ్లు పోశారు.

శేషవాహనంపై అగస్త్యేశ్వరస్వామి కటాక్షం



నారాయణవనం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధంగా న్న మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి స్వామిఅమ్మవార్లను శేషవాహనంపై ఊరేగించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు నిత్యపూజా కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై ఆలయ అంతర ప్రాకారంలో ఊరేగించారు. సాయంత్రం విశేష పూజల అనంతరం, మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటల నడుమ స్వామిఅమ్మవార్లను శేష వాహనంపై అధిష్ఠింపజేసి గ్రామంలో ఊరేగించారు. ఆలయాధికారి నాగరాజు, ఏఈవో రవి, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎమ్మెల్యే సుధీర్

వినతుల స్వీకరణ



శ్రీకాళహస్తి, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. ఉరందూరులోని తన స్వగృహంలో ఆదివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తరువాత సమస్యలను ఎప్పటికపుడు పరిష్కరిస్తున్నానని చెప్పారు. అనంతరం వినతులను ఆయా శాఖల అధికారులకు పంపించారు. టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్‌లో బస్సుల కొరత



బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

తిరుపతి(ఆర్టీసీ), మే 4(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్ స్టేషన్‌లో ఆదివారం ఆర్టీసీ బస్సుల కొరత ఏర్పడింది. ప్రధాని సభకు తరలివెళ్లిన డ్రైవర్లు శనివారం విశ్రాంతి తీసుకున్నారు. దీంతో డిపోకు 20బస్సుల చొప్పున డిపోలకు పరిమితమయ్యాయి. ఈ ప్రభావం సెంట్రల్ బస్ స్టేషన్‌పై పడింది. సకాలంలో బస్సులు ప్లాట్‌ఫామ్స్ వద్దకు రాకపోవడంతో ప్రయాణికులకు గంటల కొద్దీ నిరీక్షణ తప్పలేదు. అప్పుడప్పుడు వచ్చిన బస్సులో సీట్లకోసం పోటీపడడం కనిపించింది. ఓపికలేక కొంతమంది ప్రైవేటు వాహనాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకున్నారు. బస్సులకు సంబంధించిన సమాచారం చెప్పేవారే లేరంటూ ఆగ్రహించారు. ప్రతి వారాంతంలోనూ ఏదో ఒక కారణంతో బస్సుల కొరత ఏర్పడుతోందని అంటున్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడులు

ఐదుగురి అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), మే 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ముళ్లపూడి గ్రామంలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇంటిపై తిరుచానూరు పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ వివరాల మేరకు.. ముళ్లపూడి సమీపంలోని ఒక ఇంటిని శ్రీనివాసపురానికి చెందిన రమేష్ అద్దెకు తీసుకుని, వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేశారు. రమేష్‌తో పాటు విజయవాడ, జంగారెడ్డిగూడెంకు చెందిన ఇద్దరు మహిళలు, తిరుచానూరుకు చెందిన హేమసాయి, సంజయ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



తిరుపతి(నేరవిభాగం), మే 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం తిరుపతిలో చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు... కడప జిల్లా బద్వేలుకు చెందిన వినోద్‌కుమార్(35) తిరుపతిలోని ఓటేరులో చిన్నాన్న జాన్‌మోష్ ఇంట్లో ఉంటున్నాడు. ఆదివారం ద్విచక్ర వాహనంలో మామిడి కాయల మండీ సమీపంలోని ఫ్లైవోవర్ వద్ద వేగంగా వస్తున్నాడు. అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముక్కంటి సేవలో మాజీ మంత్రి చిన్నరాజప్ప



శ్రీకాళహస్తి, మే 4(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని ఆదివారం మాజీ హోం మంత్రి చిన్నరాజప్ప దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా టీడీపీ నాయకులు ప్రకాష్‌నాయుడు, పొన్నారావు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించారు.

వేంకటేశ్వరాలయ నిర్మాణానికి భూమిపూజ

వరదయ్యపాళెం, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని యానాదివెట్టులో నూతనంగా నిరించనున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భూమి పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. టీడీపీ నాయకులు నందకిషోర్‌రెడ్డి, రాజేంద్ర నాయుడు, ఇళంగోవన్‌రెడ్డి, సురేష్‌నాయుడు, మురళీ నాయుడు, తులసి, పుట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మహా కుంభాభిషేకం

పిచ్చాటూరు, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరువాయిలో నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో అభయ ఆంజనేయస్వామి ఉపాలయ మహా కుంభాభిషేకం ఆదివారం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిమూలం హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త ప్రకాష్ నాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, టీడీపీ నాయకుడు పద్దురాజు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

రేణిగుంట, మే 4 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడపొద్దని అర్బన్ సీఐ జయచంద్ర హెచ్చరించారు. ఆదివారం దొడ్లమిట్ట బీసీ కాలనీలో గంజాయి సేవనంపై యువతకు అవగాహన కల్పించారు. అలాగే దాబాలను పరిశీలించారు. దాబాల్లో మద్యాన్ని అనుమతించకూడదని సిబ్బందిని హెచ్చరించారు.

కత్నా శిబిరానికి స్పందన

శ్రీకాళహస్తి, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈదులగుంట సమీపంలో ఉన్న షాదీమహల్‌లో కత్నా శిబిరం జరిగింది. హజరత్ మహబూబ్ సుబాని రహ నిషాన్ ముత్తవల్లి షేక్ మీర్జాన్ సాహెబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వెంకటగిరికి చెందిన డాక్టర్ అహమ్మద్‌బాషా పాల్గొని ముస్లిం పిల్లలకు కత్నా చేశారు. అనంతరం వారికి పండ్లు, బ్రెడ్, మందులు సరఫరా చేశారు. ఈ సందర్భంగా శిబిర నిర్వాహకులు మాట్లాడుతూ 26 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. లాలు ఇస్మాయిల్, ఆరీఫ్, యాసిన్, ఖాదర్‌బాషా, ముజీబ్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.